
సాక్షి
అనంతపురం
బుధవారం : 11 : జనవరి : 2023



ముమ్మరంగా ఈ-క్రాప్
జిల్లాలో ఈ-క్రాప్ నమోదు సాగుతోంది. రబీలో సాగు చేసిన పంటల వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నారు. IIలో



టమాట కిలో రూ.13
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్ట ధర రూ.3 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.4°/08.1°
జిల్లా అంతటా మంగళవారం చలి తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి.

న్యూస్‌రీల్

కౌలు రైతులు సీసీఆర్ కార్డులు తీసుకోవాలి



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

గార్లదిన్నె: కౌలు రైతులు పంట సాగుదారు హక్కు (సీసీఆర్) కార్డులు పొందాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. మంగళవారం గార్లదిన్నె రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు కూడా అందించాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని, భూ యజమానులు ఇందుకు సహకరించాలని సూచించారు. కౌలు రైతులు రైతు భరోసా, సున్నా వడ్డీ, పంట రుణాలు, పంటల బీమా, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. కౌలు రైతులకు సందేహాలు ఉంటే జీవన రేఖ హెల్ప్‌లైన్ 08554-297328, 94909 00800 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, ఏఓ సోమశేఖర్, ఏఈఓ స్రవంతి, వీహెచ్ఏలు ఫరేశా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులూ.. ఓటరుగా నమోదు చేసుకోండి



వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని పట్టభద్రులు ఈ నెలాఖరులోపు ఎమ్మెల్సీ పట్టభద్ర ఓటరుగా నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. 2019 అక్టోబర్ 30 నాటికి డిగ్రీ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారందరూ ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మరో అవకాశం ఉన్నందున గ్రాడ్యుయేట్లందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డీఎంహెచ్ఓ బాధ్యతల స్వీకరణ



డీఎంహెచ్ఓ వీరబ్బాయికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యాధికారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)గా డాక్టర్ వీరబ్బాయి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రంపచోడవరం వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై అనంతపురం డీఎంహెచ్‌గా వచ్చారు. నూతన డీఎంహెచ్ఓకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మాతాశిశు మరణాలు తగ్గించండి

మాతాశిశు మరణాలు తగ్గించేందుకు సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం గత నెలలో జరిగిన రెండు మాతృ, ఆరు శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. తప్పనిసరిగా ఆరోగ్య సిబ్బంది, సంబంధిత శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి వారికి ఆరోగ్య సలహాలు అందించాలన్నారు. హైరిస్క్ కేసుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, వైద్యాధికారులు డాక్టర్ సుజాత, ఐసీడీఎస్ సీడీపీఓ లలిత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

తాడిపత్రి: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని సిబ్బందిని హౌసింగ్ పీడీ కేశవనాయుడు ఆదేశించారు. తాడిపత్రి పరిధిలోని ఆర్డీటీ కాలనీ, సజ్జలదిన్నె, యర్రగుంటపల్లి గ్రామాల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పనులు మందకొడిగా సాగుతుండడంతో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువ మందితో పనులు సకాలంలో ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తూ ఉగాది నాటికి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించే ఏర్పాటు చేయాలని తాడిపత్రి హౌసింగ్ డీఈ సుబ్బరాయుడు, ఏఈ సంధ్యను ఆదేశించారు.

భూసేకరణ ముమ్మరం

హైవే ప్రాజెక్టుల్లో వేగం

- అనంతపురం జిల్లాలో 623 హెక్టార్ల భూమి అవసరం
- శ్రీసత్యసాయి జిల్లాలో 1,452 హెక్టార్ల సేకరణ లక్ష్యం
- 2024 డిసెంబరు నాటికి ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం
- అంతర్రాష్ట్ర కనెక్టివిటీతో ఉమ్మడి జిల్లాలో మెరుగైన రవాణా



ముదిగుబ్బ వద్ద నేషనల్ హైవే కోసం సేకరిస్తున్న భూమి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో జాతీయ రహదారి ప్రాజెక్టులు వేగం పుంజుకున్నాయి. రాష్ట్రంలో పలు జిల్లాలను కలపడంతో పాటు కర్ణాటక రాజధాని బెంగళూరు నుంచి ఆంధ్రప్రదేశ్‌ను కలుపుతూ వివిధ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో భూసేకరణ చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలో 1,452 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 623 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. అధికార యంత్రాంగం ఇప్పటికే అనంతపురం జిల్లాలో 312 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించింది. శ్రీసత్యసాయి జిల్లాలో 216 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించారు. ఏడాదిన్నరలో ప్రాజెక్టులు పూర్తి చేసే విధంగా ముందుకెళుతున్నారు. రోడ్లతో పాటు పలు ప్రాంతాల్లో వంతెనలు కూడా ఉన్నాయి. ప్రాజెక్టులు మొత్తం 2024 సంవత్సరం చివరికల్లా పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ మొత్తం 31 ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ జరుగుతోంది.

వివిధ ప్రాజెక్టుల వివరాలు..

- ఉరవకొండ – అనంతపురం – కదిరి – మదనపల్లి – కుప్పం – కృష్ణగిరి వరకూ మొత్తం 197 కిలోమీటర్ల రోడ్డుకు సేకరణ పూర్తి చేయనున్నారు.
- ధార్వాడ్ – హుబ్లి – గదగ్ –కొప్పల – హొసపేటె– బళ్లారి – గుత్తి – తాడిపత్రి – ముద్దనూరు – మైదుకూరు – బద్వేల్ – ఆత్మకూరు – నెల్లూరు – కృష్ణపట్నం వరకూ జాతీయ రహదారి–67లో మొత్తం 118 కిలోమీటర్లు చేపడుతున్నారు.
- అనంతపురం – తాడిపత్రి – బనగానపల్లి – గాజులపల్లి – గిద్దలూరు – కంభం – వినుకొండ – నరసరావుపేట – గుంటూరు వరకూ జాతీయ రహదారి 544డీలో భాగంగా భూసేకరణ చేపడుతున్నారు.
- కొడికొండ – లేపాక్షి – హిందూపురం – మడకశిర వరకూ 544ఈ జాతీయ రహదారిలో 102 కిలోమీటర్ల రోడ్డు చేపడుతున్నారు.
- ముదిగుబ్బ జంక్షన్ ఏర్పాటు చేస్తూ కనెక్టింగ్ ఏర్పాటులో భాగంగా పుట్టపర్తి మీదుగా ఎన్‌హెచ్–44లో కోడూరు వద్ద కలుపుతారు.
- జాతీయ రహదారి ఎన్‌హెచ్ – 716లో ముద్దనూరు – పులివెందుల – కదిరి – ఓబుళదేవరచెరువు – గోరంట్ల – పాలసముద్రం క్రాస్ నుంచి హిందూపురం ఎన్‌హెచ్ 544ఈకి అనుసంధానిస్తారు.

అనంతపురం జిల్లాలో జాతీయ రహదారి ప్రాజెక్టుల భూసేకరణ ఇలా..

మొత్తం ప్రాజెక్టులు	13
భూసేకరణ అవసరం	623 హెక్టార్లు
ప్రభుత్వ భూమి	75 హెక్టార్లు
ప్రైవేటు భూమి	548 హెక్టార్లు
ఇప్పటివరకూ ప్రభుత్వ భూమి సేకరణ	74 హెక్టార్లు
ఇప్పటివరకూ ప్రైవేటు భూమి సేకరణ	312 హెక్టార్లు

శ్రీసత్యసాయి జిల్లాలో జాతీయ రహదారి ప్రాజెక్టుల భూసేకరణ

మొత్తం ప్రాజెక్టులు	18
భూసేకరణ అవసరం	1,452 హెక్టార్లు
ఇందులో ప్రభుత్వ భూమి	269 హెక్టార్లు
ప్రైవేటు భూమి	1,183 హెక్టార్లు
ఇప్పటివరకూ ప్రభుత్వ భూమి సేకరణ	73 హెక్టార్లు
ఇప్పటివరకూ ప్రైవేటు భూమి సేకరణ	216 హెక్టార్లు

వేగంగా భూసేకరణ

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా ఏర్పాటవుతున్న పలు జాతీయ రహదారులకు భూసేకరణ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే చాలామటుకు పూర్తిచేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఉన్నాయి. కొంత అటవీ భూములను కూడా డైవర్షన్ చేశారు.

–మధుసూదన్‌రావు, ఈఈ, జాతీయ రహదారులు

వణికిస్తోంది

- ఉష్ణోగ్రతలు భారీగా పతనం



అనంతపురం అగ్రికల్చర్: ఉష్ణోగ్రతలు భారీగా పతనమవుతుండటంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చలి వణికిస్తోంది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. సాయంత్రం, రాత్రిళ్లు, ఉదయం పూట మంచుతో కూడిన శీతల వాతావరణం నెలకొంది. చాలా మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపు నమోదవుతున్నాయి. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా అగళిలో 7.6 డిగ్రీలు, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 8.1 డిగ్రీల కనిష్టం నమోదవడం విశేషం. మడకశిర 8.1, శెట్టూరు 8.9, రొద్దం 9.3, తనకల్లు 9.4, గుమ్మఘట్ట 9.6, నల్లచెరువు, విడపనకల్లు 9.8, తలుపుల, హిందూపురం 9.9, కంబదూరు, ఉరవకొండ 10.1, అమడగూరు 10.3, అమరాపురం 10.4, ఓడీ చెరువు, కణేకల్లు 10.5, బొమ్మనహాళ్ 10.6, కళ్యాణదుర్గం 10.9 డిగ్రీల కనిష్టం నమోదు కాగా.. మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 27 నుంచి 31 డిగ్రీల మధ్య కొనసాగాయి. చలి తీవ్రత పెరగడంతో జనం గజగజ వణుకుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

రాత్రి వేళల్లో తగ్గనున్న ఉష్ణోగ్రతలు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రాత్రి వేళ ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీఎంఐపీ ప్రగతిపై నేడు సమీక్ష

అనంతపురం సిటీ: ఏపీఎంఐపీ ప్రగతిపై బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఫిరోజ్‌ఖాన్ మంగళవారం తెలిపారు. ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరినాథరెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమీక్ష సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ఉద్యాన, ఏపీఎంఐపీ, డ్రిప్‌ఇరిగేషన్ అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

వేరుశనగకు ఎకరాకు రూ.32 వేలు

- 2023–24 పంటల వారీగా రుణపరిమితిపై చర్చ
- కలెక్టర్ నాగలక్ష్మి సమక్షంలో డీఎల్‌టీసీ సమావేశం
- గతేడాది కన్నా పెంచి ఎస్ఎల్‌టీసీకి ప్రతిపాదనలు



డీఎల్‌టీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: రానున్న ఖరీఫ్, రబీలో వేరుశనగ సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.32 వేలు చొప్పున బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. మంగళవారం అనంతపురంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) హాలులో కలెక్టర్ నాగలక్ష్మి సమక్షంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంటల వారీగా గరిష్ట రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ప్రతిపాదనలు పంపడానికి జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశం నిర్వహించారు. డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల నుంచి తీసుకున్న ప్రతిపాదనలపై చర్చించి పంటల వారీగా గరిష్ట రుణపరిమితి ప్రతిపాదనలు ఆమోదం కోసం స్టేట్ లెవెల్ టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ)కి పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కువగా సాగవుతున్న వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, వరి, మొక్కజొన్న, పప్పుశనగతో పాటు మిరప, టమాట, చీనీ, దానిమ్మ, మామిడి, మల్బరీ తదితర పంటలకు బ్యాంకుల ద్వారా ఎంత మేరకు రుణాలు ఇస్తే సరిపోతుందనే దానిపై చర్చించారు. ఆయా పంటలకు పెడుతున్న పెట్టుబడులు (కాస్ట్ ఆఫ్ క ల్టివేషన్), విత్తనం, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు, పంట దిగుబడులు, ఎంఎస్‌పీ ద్వారా ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. గత మూడేళ్ల గణాంకాల ఆధారంగా ఈ ఏడాది రైతులకు ఉపయోగపడేలా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (గరిష్ట రుణపరిమితి) నిర్ణయించి ఎస్ఎల్‌టీసీకి పంపాలని ఆదేశించారు. బ్యాంకులు కూడా రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని పంట రుణాల రెన్యూవల్స్, కొత్త రుణాల పంపిణీ సులభతరంగా చేయాలని సూచించారు.

పంటల వారీగా రుణపరిమితి సిద్ధం

ఎస్ఎల్‌టీసీకి పంపిన ప్రతిపాదనల్లో వేరుశనగకు గతేడాది ఎకరాకు రూ.30 వేలు ఉండగా ఈ సారి రూ.2 వేలు పెంచి గరిష్ట రుణపరిమితి రూ.32 వేలుగా నిర్ణయించారు. బ్యాంకర్లకు ఉన్న వెసులుబాటుతో వేరుశనగకు రూ.40 వేల దాకా ఇవ్వడానికి అవకాశం ఉందన్నారు. వరికి రూ.41 వేలు, కందికి రూ.22 వేలు చేశారు. పత్తికి రూ.41 వేలు, మొక్కజొన్నకు రూ.37 వేలు, ఆముదంకు రూ.20 వేలు, పచ్చిమిరపకు రూ.72 వేలు, ఎండుమిరపకు రూ.90 వేలు, టమాటకు రూ.80 వేలు, ఉల్లికి రూ.40 వేలు, కరివేపాకు పంటకు రూ.50 వేలు, అరటికి రూ.1.10 లక్షలు, చీనీకి రూ.60 వేలు, దానిమ్మకు రూ.92 వేలు, మామిడికి రూ.38 వేలు, మల్బరీ సాగుకు రూ.రూ.90 వేలు ఇవ్వాలని నిర్ణయించి.. ప్రతిపాదనలను ఎస్ఎల్‌టీసీకి పంపనున్నట్లు తెలిపారు. చిరుధాన్యపు పంటలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహించి విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ – క్రాప్ డేటా ఆధారంగా ప్రభుత్వం నుంచి రైతులకు ప్రయోజనాలు కల్పించడంలో అలసత్వానికి తావులేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో రెండు జిల్లాల ఎల్‌డీఎంలు బి.నాగరాజారెడ్డి, సాయినాథరెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, వ్యవసాయశాఖ అధికారులు బి.చంద్రానాయక్, సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారులు రఘునాథరెడ్డి, జి.చంద్రశేఖర్, పట్టు, పాడి, మత్స్యశాఖ అధికారులు, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, కెనరాబ్యాంకు, ఏపీజీబీ ఆర్‌ఎంలు పాల్గొన్నారు.

నరసాపురంలో జేసీ బ్రదర్స్‌కు షాక్



వైఎస్సార్‌సీపీలో చేరిన రామాంజులరెడ్డి, ఆయన వర్గీయులు

- 160 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పెద్దపప్పూరు: టీడీపీ కంచుకోట నరసాపురంలో జేసీ బ్రదర్స్ (దివాకర్‌రెడ్డి– ప్రభాకర్‌రెడ్డి)కు గట్టి షాక్ తగిలింది. వారి ప్రధాన అనుచరుడైన రామాంజులరెడ్డి, ఆయన వర్గీయులు దాదాపు 160 కుటుంబాల వారు టీడీపీకి గుడ్‌బై చెప్పారు. యాడికి మండలం రాయలచెరువుకు చెందిన రమణారెడ్డి నేతృత్వంలో వీరంతా మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కండువా కప్పి అందరినీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో పార్టీ మారడం టీడీపీ కంచుకోటకు బీటలు బారినట్లయ్యింది. ఈ సందర్భంగా పెద్దారెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ సీఎం జగన్ పాలన సాగిస్తుండటంతో ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందన్నారు. టీడీపీ కోసం అహర్నిశలు శ్రమించినా గుర్తింపు లభించకపోవడం, వర్గ కక్షలు పెంచి పోషించే జేసీ సోదరుల వైఖరి నచ్చకపోవడంతో 160 కుటుంబాల వారు పార్టీ వీడారన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారందరికీ ఎప్పుడు ఏ కష్టం వచ్చినా.. అండగా ఉండి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు హాజీవలి, మండల యూత్ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు చిక్కేపల్లి రామేశ్వర్‌రెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి, నరసాపురం రామచంద్ర (కాశీ), ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత క్రీడల జోలికెళ్లొద్దు

- సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి
- అన్ని సబ్ డివిజన్లలో 30 పోలీస్ యాక్టు అమలు
- అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ వెల్లడి



మాట్లాడుతున్న డీఐజీ ఎం.రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సంప్రదాయ క్రీడలతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగను సంతోషంగా జరుపుకోవాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ ప్రజలకు సూచించారు. నిషేధిత క్రీడలైన కోడి పందేలు, జల్లికట్టు, జూదాల జోలికి వెళ్లరాదన్నారు. ఈ క్రీడల్లో పాల్గొన్నా.. ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జూదాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామ మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని సీఐలు, ఎస్ఐలు గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి నిషేధిత జూదాలు, క్రీడలు జరగకుండా సమాయత్తం చేయాలన్నారు. డీఎస్పీలు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. కోడి పందేలు, జల్లికట్టు ఆటలు జరిగే వీలున్న ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో కోడి పందేలు, జల్లికట్టు కేసులు నమోదైన వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. కోళ్లకు కత్తులు కట్టి పందేలు ఆడటం, జన సమూహాల మధ్యన ఎద్దులను రెచ్చగొట్టి కట్టడి చేయడంలో భాగంగా హింసించడం లాంటి పనులు చేయరాదన్నారు. జల్లికట్టు, కోడి పందేల నిర్వహణ వేదికలకు ఎవరైనా తోటలు, స్థలాలు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు.

30 పోలీస్ యాక్ట్ అమలు..

అన్ని సబ్ డివిజన పరిధిలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని డీఐజీ తెలిపారు. పోలీసుల హెచ్చరికలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లకుండా ఇంటిల్లిపాది పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. నిషేధిత క్రీడలు, జూదాల నిర్వహణపై డయల్ 100కు సమాచారమందించాలని విజ్ఞప్తి చేశారు.

విలువైన వస్తువులు జాగ్రత్త!

- ఊరికెళ్లే వారికి ఎస్పీ ఫక్కీరప్ప విజ్ఞప్తి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సంక్రాంతి పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి ఊరికి బయల్దేరే వారు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని ఎస్పీ ఫక్కీరప్ప సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇళ్లకు తాళం వేసి ఉండటాన్ని అదనుగా భావించి దొంగలు చెలరేగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఊరికి వెళ్లదలచిన వారు తమ విలువైన వస్తువులు, ఆభరణాలు బ్యాంకుల్లోనో.. సురక్షితమైన స్థానాల్లోనో భద్రపరుచుకోవడం మంచిదని తెలిపారు. లేదంటే పోలీసు శాఖ అందుబాటులోకి తెచ్చిన 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం' సేవలు వినియోగించుకోవాలని సూచించారు. చోరీల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. వ్యక్తిగత జాగ్రత్త ఎప్పటికీ మీతో పాటు మీ వస్తువులను కూడా కాపాడుతుందని గుర్తు చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాల్లో ప్రతీది పోస్టులు పెట్టడం నేటి తరం వారికి అలవాటుగా మారిందన్నారు. అలాగని పండుగకు ఊరెళ్లిన సమాచారం సోషియల్ మీడియాలో పోస్ట్ చేయకుండా ఉండటమే మంచిదని హితవు పలికారు. బస్సుల్లో ప్రయాణించే వారు విలువైన వస్తువులు, ఆభరణాలను అత్యంత జాగ్రత్తగా తీసుకెళ్లాలని సూచించారు.

ప్రైవేట్ వ్యక్తి పైశాచికం

- మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిందని బాధితురాలికి ఫోన్‌లో బెదిరింపులు



అనంతపురం టౌన్: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తులతో పని చేయించుకోరాదు. అయితే జిల్లా కేంద్రంలోనే ఆ నిబంధనను అధికారులు పెడచెవిన పెట్టారు. ప్రైవేట్ వ్యక్తులతో దర్జాగా పనిచేయించుకుంటున్నారు. ఇప్పుడో వ్యక్తి కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగిపై పైశాచికత్వం ప్రదర్శిస్తున్నాడు. ఆ వ్యక్తితో తమకున్న అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. వేధింపులు భరించలేక బాధిత మహిళ డ్యూటీకి రావడానికి జంకే పరిస్థితి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రామ్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ మహిళా ఉద్యోగిపై అక్కడ పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి కన్నేశాడు. చూపులతోను, మాటలతోను, చేష్టలతోను లైంగికంగా వేధిస్తున్నాడు. రోజూ ఫోన్ చేసి మరీ వేధింపులకు పాల్పడుతుండటంతో భరించలేకపోయింది. తనకు రక్షణ కల్పించాలని బాధితురాలు ఐదు రోజుల క్రితం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు సదరు వ్యక్తిని పిలిపించి మందలించి పంపించారు. ఆగ్రహించిన ప్రైవేట్ వ్యక్తి 'నాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా..? నీ కథ చూస్తా' అంటూ మహిళా ఉద్యోగికి ఫోన్ చేసి బెదిరించాడు. హడలిపోయిన ఆమె విధులకు వెళ్లకుండా ఆగిపోయింది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపింది. సదరు వ్యక్తికి రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు అండగా ఉండటంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధిత మహిళా ఉద్యోగి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లేందుకు అనుమతివ్వాలని ఉన్నతాధికారులను కోరినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) నాగభూషణంను వివరణ కోరగా.. లిఖిత పూర్వకంగా తమకు ఫిర్యాదు చేయనందున చర్యలు తీసుకోలేదన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

- పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు



మాట్లాడుతున్న రుద్రరాజు

అనంతపురం టవర్‌క్లాక్: ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు. మంగళవారం అనంతపురానికి వచ్చిన ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దశాబ్దాల చరిత్రను పరిశీలిస్తే అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమైందనే విషయం రుజువవుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ వైఫల్యాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు భారత్ జోడో యాత్రను రాహుల్ గాంధీ చేపట్టారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 26 నుంచి మార్చి 26 వరకూ రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజా సమస్యలు గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదాను కల్పించి తీరుతామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాపరెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, నగర అధ్యక్షుడు దాదాగాంధీ, ఎస్సీ విభాగం అధ్యక్షుడు శంకర్, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, నాయకులు రామానాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతుడు రంజిత్ కుమార్

తాడిపత్రి: రైలు పట్టాలపై ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం పీఎం కొండాపురం గ్రామానికి చెందిన లింగుట్ల రంజిత్‌కుమార్ (27) మూడు నెలల క్రితం తాడిపత్రికి చెందిన చంద్రికను కులాంతర వివాహం చేసుకున్నాడు. అనంతరం గన్నెవారిపల్లి కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఏర్పాటు చేసుకుని, అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను మధ్యాహ్నం యల్లనూరు రోడ్డు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద పట్టాలపై రైలు కింద పడి మృతి చెందాడు. అయితే రంజిత్‌కుమార్‌కు ఆత్మహత్య చేసుకునేంత ఇబ్బందులు ఏవీ లేవని, ఈ మృతిపై తమకు అనుమానం ఉందంటూ మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ముమ్మరంగా ఈ–క్రాప్ బుకింగ్

- ఆర్‌బీకే వేదికగా పంటల నమోదు ప్రక్రియ
- ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే ఆదుకుంటున్న జగన్ సర్కార్
- ఉచిత పంటల బీమా పథకానికి ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



మొక్కజొన్న పొలంలో ఈ క్రాప్ నమోదు చేయించుకుంటున్న ఈ రైతు పేరు జంగటి పురుషోత్తం. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామం. సర్వే నంబర్ 243–1ఏ, 157–1ఎల్ లోని 3.98 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఈ–క్రాప్ నమోదు చేయించుకుంటే ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తిస్తుందని తెలుసుకుని సచివాలయంలోని ఎంపీఈఓ నాగరాజును సంప్రదించాడు. వెంటనే ఎంపీఈఓ ఆ రైతు పొలానికి చేరుకుని ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామంలోనే ఆర్‌బీకేను ఏర్పాటు చేయించడంతో కళ్యాణదుర్గానికి పోయే శ్రమ తగ్గిందని, దీని వల్ల తన సమయం కూడా ఆదా అయిందంటూ ఈ సందర్భంగా రైతు పురుషోత్తం హర్షం వ్యక్తం చేశాడు.

కళ్యాణదుర్గం: జిల్లాలో రబీ ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఆర్‌బీకే వేదికగా తాముంటున్న గ్రామంలోనే సేవలు అందుబాటులోకి రావడంతో రైతులకు సమయంతో పాటు శ్రమ ఆదా అవుతోంది. అంతేకాక వ్యవసాయ శాఖ సిబ్బంది సైతం ఇంటింటా తిరిగి ఈ–క్రాప్ నమోదు వల్ల ఒనగూరే సౌలభ్యాలపై రైతులను చైతన్య పరుస్తున్నారు.

ఎటు చూసినా పచ్చని పంటపొలాలు

టీడీపీ హయాంలో ఈ–క్రాప్ నమోదుపై రైతులను చైతన్య పరచడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం కనబరిచింది. దీంతో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినప్పుడు కనీస పరిహారానికి సైతం రైతులు నోచుకోలేక పోయారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సంక్షేమానికి బాటలు పడ్డాయి. జగన్ సర్కార్ చొరవతో గ్రామగ్రామానికి రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటయ్యాయి. విత్తనం మొదలు పంట దిగుబడుల విక్రయాల వరకూ ప్రతి అంశంలోనూ ఆర్‌బీకే వేదికగా రైతు ముంగిటకే ప్రభుత్వం అన్ని రకాల సేవలు అందిస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రైతుకు శ్రమతో పాటు సమయమూ ఆదా అవుతుండడంతో పాటు సమస్యల పరిష్కారం, విత్తనం, ఎరువులు, క్రిమి సంహారక మందులు తదితరాల కొనుగోలు కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా పోయింది. దీంతో రైతుల దృష్టి మొత్తం వ్యవసాయంపైనే కేంద్రీకృతం కావడంతో పల్లె సీమలు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయి.

ఈ క్రాప్‌తో ఉపయోగం ఇలా..

- ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినప్పుడు పరిహారం పొందవచ్చు.
- పంటల బీమా పథకానికి సంబంధించి రైతు వాటా సొమ్మును ప్రభుత్వమే చెల్లిస్తుంది. తద్వారా పంట నష్టపోయినప్పుడు రైతుకు ఉచితంగా పరిహారం అందినట్లవుతుంది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీని పొందవచ్చు.
- పంట రుణాలు తీసుకున్న వారికి సున్నా వడ్డీ పథకం వర్తిస్తుంది.
- వ్యవసాయ ఆధారిత పనిముట్లను రాయితీతో పొందవచ్చు.

రబీ ఈ క్రాప్ నమోదు వివరాలు ఇలా..

జిల్లాలో ఈ క్రాప్ చేయాల్సిన గ్రామాల సంఖ్య	504
వ్యవసాయ పంట సాధారణ సాగు	3,02,611 ఎకరాలు
ఉద్యాన పంటల సాధారణ సాగు	28,751 ఎకరాలు
ఇప్పటి వరకూ ఈ క్రాప్ పూర్తయినవి	1,09,571 ఎకరాలు
సద్వినియోగం చేసుకున్న రైతులు	26,843

ఈ నెలాఖరులోపు ఈ–క్రాప్ చేయించాలి



రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈ నెలాఖరులోపు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఈ విషయంగా ఇప్పటికే అన్ని మండలాల వ్యవసాయాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. గ్రామాలలో ఆర్‌బీకేల వద్ద అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి.

– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

నా చావుకు ఎవరూ కారణం కాదు!

- సెల్ఫీ వీడియో సందేశాన్ని భార్యకు పంపిన భర్త
- హెచ్చెల్సీ గట్టుపై బైక్, సెల్‌ఫోన్, షర్ట్ లభ్యం
- మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు



మల్లికార్జున

కణేకల్లు: తన చావుకు ఎవరూ కారణం కాదంటూ భార్యకు వీడియో సందేశాన్ని పంపి భర్త కనిపించకుండా పోయాడు. వివరాలు.. కణేకల్లు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన మల్లికార్జున, జయలక్ష్మి దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. యర్రగుంట బస్టాండ్ ప్రాంతంలో సెల్‌ఫోన్ల మరమ్మతు దుకాణాన్ని మల్లికార్జున నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యం బారిన పడిన అతను ఈ విషయాన్ని భార్యకు కూడా తెలపలేదు. డాక్టర్ వద్దకు ఒక్కడే వెళ్లి చికిత్స చేయించుకుని వచ్చేవాడు. మంగళవారం ఉదయం తాను దుకాణానికి వెళుతున్నట్లు ఇంట్లో తెలిపి బయటకు వచ్చిన అతను.. ద్విచక్ర వాహనంపై మాల్యం – నాగేపల్లి గ్రామాల మధ్య ఉన్న హెచ్చెల్సీ గట్టుకు చేరుకున్నాడు. అనంతరం కాలువ గట్టుపై నిల్చొని తన చావుకు ఎవరూ కారణం కాదని, ఆరోగ్యం బాగాలేక పోవడంతో జీవితంపై విరక్తితో కాలువలో దూకి చనిపోతున్నానంటూ సెల్ఫీ వీడియో తీసి భార్యకు పంపాడు. ఆలస్యంగా ఈ సందేశాన్ని గమనించిన భార్య జయలక్ష్మి తీవ్ర ఆందోళనకు గురైంది. విషయాన్ని వెంటనే కుటుంబసభ్యులకు, బంధువులకు, పోలీసులకు చేరవేయడవంతో అందరూ ఆగమేఘాలపై కాలువ గట్టుకు చేరుకున్నారు. అక్కడ మల్లికార్జున ద్విచక్ర వాహనంతో పాటు సెల్‌ఫోన్, షర్ట్ లభ్యమయ్యాయి. కుటుంబ సభ్యులు కాలువ వెంబడి గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'గోల్‌మాల్'పై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ: మహిళా సంఘాల్లో చోటు చేసుకున్న అక్రమాలపై అధికారులు విచారణకు ఆదేశించారు. టీడీపీ హయాంలో వారికి అనుకూలమైన యానిమేటర్లను నియమించుకుని ప్రజాప్రతినిధులు దోపిడీ కొనసాగించారు. ఇదే పంథాను నేటికీ కొనసాగిస్తూ యానిమేటర్ వహీదా భాను సాగించిన అక్రమాలపై 'మహిళా సంఘాల్లో గోల్‌మాల్' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, విచారణకు ఆదేశించడంతో డీఆర్‌డీఏ ఏపీడీ ఈశ్వరయ్య మంగళవారం విచారణ చేపట్టారు. వైకేపీ ఏసీ శివయ్యతో కలసి బాబా మహిళా సంఘం సభ్యులతో సమావేశమై యానిమేటర్ మోసాలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి యానిమేటర్ వహీదాభాను అక్రమాలకు పాల్పడినట్లుగా నిర్ధారించారు. స్వాహా చేసిన సభ్యుల సొమ్ముతో పాటు స్త్రీనిధి డబ్బునూ రెండు రోజుల్లోపు తిరిగి చెల్లించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వహీదాభానును హెచ్చరించారు. చందమామ గ్రామైక్య సంఘంలో చోటుచేసుకున్న అవినీతిపై కూడా విచారణ చేసి బాధ్యులైన యానిమేటర్లు, సహకరించిన సీసీలపై చర్యలు చేపడతామన్నారు.

యానిమేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు

యానిమేటర్ వహీదాభానుపై పోలీసులకు బాబా మహిళా సంఘం సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. తమను మోసం చేసి కాజేసిన రూ.10 లక్షలను తిరిగి ఇప్పించాలని కోరుతూ లిఖిత పూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు.

జిల్లా స్థాయి వాలీబాల్ లీగ్ పోటీలు రేపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: శాప్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ లీగ్ పోటీలు గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు మంగళవారం తెలిపారు. అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి క్రీడా మైదానం వేదికగా ఉదయం 8.30 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. అండర్–21 పురుషుల విభాగంలో జరిగే పోటీల్లో పాల్గొనే ఔత్సాహిక జట్లు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలి. మరింత సమాచారానికి 80990 55553లో సంప్రదించవచ్చు.

ఐటీఐ అప్రెంటీస్ అభ్యర్థుల జాబితా విడుదల

అనంతపురం క్రైం: ఐటీఐలో మోటర్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, డ్రాఫ్ట్‌మ్యాన్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారికి ఆర్టీసీలో అప్రెంటీస్ షిప్పుకు అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించి అర్హులైన వారి జాబితాను ఆర్టీసీ కర్నూలు జోనల్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవి మంగళవారం విడుదల చేశారు. డీజిల్ మెకానిక్ విభాగంలో సీరియల్ నంబర్ 48, 29, 100, 73, 76, 89, 1, 71, 60, 22, 14, 5, 8, 25, 33, 47, 20, 56, 112, 120, 86, 62, 85, 26, 55, 81, 75, 37, 13, 104, 49, 17, 90, 95, 18, 94, 70, 46, 109, 50, 82, 93, 59, 91, 67 ఉన్న అభ్యర్థులు ఎంపికయ్యారు. అలాగే మోటర్ మెకానిక్ విభాగంలో 6, 5, 11 సీరియల్ నంబర్ అభ్యర్థులు, ఎలక్ట్రీషియన్ విభాగంలో 40, 52, 31, 16, 17 సీరియల్ నంబర్ అభ్యర్థులు, వెల్డర్ విభాగంలో 10వ నంబర్, పెయింటర్ విభాగంలో 3వ నంబర్, డ్రాఫ్ట్‌మ్యాన్ (సివిల్) విభాగంలో రెండో నంబర్ అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 17న ఉదయం 9 గంటలకు కర్నూలులోని శిక్షణ కళాశాలలో జరిగే వెరిఫికేషన్ ప్రక్రియకు ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలి.

నిరుద్యోగ మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు. ఈ మేరకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16న ప్రారంభమై 60 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో కంప్యూటర్ బేసిక్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇంటర్ పాస్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్, ఇంజినీరింగ్ పాస్/ఫెయిల్ అయి, 20 నుంచి 30 ఏళ్ల లోపు ఉన్న మహిళలు మాత్రమే అర్హులు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్, శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తారు. పూర్తి సమాచారానికి 77807 52418లో సంప్రదించవచ్చు.

హెచ్చెల్సీలో వివాహిత గల్లంతు



జ్యోతి (ఫైల్)

ఉరవకొండ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత హెచ్చెల్సీలో దూకి గల్లంతైంది. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామానికి చెందిన జ్యోతికి 20 ఏళ్ల క్రితం వెలిగొండ నివాసి సుంకన్నతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా కుటుంబంలో చోటు చేసుకున్న కలహాల కారణంగా మనస్తాపం చెందిన జ్యోతి రెండు రోజుల క్రితం తన పుట్టినింటికి చేరుకుంది. మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన ఆమె నేరుగా గ్రామ శివారులోని హెచ్చెల్సీ వద్దకు చేరుకుని కాలువలో దూకింది. కాసేపటి తర్వాత అటుగా వచ్చిన స్థానికులు హెచ్చెల్సీ గట్టుపై ఉన్న జ్యోతి స్వెట్టర్, చెప్పులు గమనించి, ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో కాలువ వెంబడి గాలింపు చేపట్టారు. అయినా జ్యోతి ఆచూకీ లభ్యం కాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి దుర్మరణం

విడపనకల్లు: ద్విచక్ర వాహనాన్ని మినీలారీ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం మాలాపురం గ్రామానికి చెందిన చిగరబంకుల వెంకటస్వామి (61), మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి టీవీఎస్ మోపెడ్‌పై ఇంటికి బయలుదేరాడు. ఇంటికి చేరువలోకి చేరుకోగానే 42వ జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన మినీలారీ ఢీకొంది. ఘటనలో వెంకటస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీ



ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో పోలీసు కుటుంబాల మధ్య మంగళవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీ ఆకట్టుకుంది. ఏపీ ఐపీఎస్ అధికారుల భార్యల సంక్షేమ సంఘం సంకల్పం, డీజీపీ రాజేంద్రనాథరెడ్డి ఉత్తర్వులతో నిర్వహించిన ఈ పోటీలో పోలీసు కుటుంబాలకు చెందిన 19 మంది మహిళలు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అదనపు ఎస్పీ నాగేంద్రుడు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు వ్యవహరించారు. పోటీలో పాల్గొన్న వారికి జ్ఞాపికలను ఏఎస్పీ ప్రదానం చేశారు. తొలి మూడు స్థానాలు దక్కించుకున్న విజేతలకు త్వరలో ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప సతీమణి చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. పోటీలను అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ ఇందిర, ఆర్‌ఐ హరికృష్ణ, ఆర్‌ఎస్‌ఐ లు ప్రదీప్‌సింగ్, బాలాజీ నాయక్, పురుషోత్తం పర్యవేక్షించారు.

సామాజిక సేవలో భాగస్వాములవ్వండి

- పెన్షనర్లకు కలెక్టర్ నాగలక్ష్మి సూచన



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: 'ఉద్యోగులుగా ప్రభుత్వానికి, ప్రజలకు అమూల్య సేవలందించారు. ఉద్యోగ విరమణ చేసిన మీరంతా సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి' అని విశ్రాంత ఉద్యోగులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ/హ్యాండ్ బుక్‌ను మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. పెన్షనర్లకు ఉపయుక్తమైన అంశాలను డైరీలో ముద్రించడంతో సంఘం నాయకులను అభినందించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న గౌడ్, జయరామప్ప, నాయకులు రామకృష్ణ, ప్రభాకర్, తిప్పన్న, రమేష్, మహమ్మద్, పుల్లప్ప, వేణుగోపాల్, మధు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

కంబదూరు: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామానికి చెందిన రమేష్ కుమారుడు రాజశేఖర చౌదరి (25), ఓబులేసప్ప కుమారుడు సోమశేఖర్ మంగళవారం కర్ణాటకలోని పెద్దపల్లి గ్రామంలో జరిగిన జాతరకు హాజరయ్యారు. రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. కంబదూరు మండలం ములకనూరు – కదిరిదేవరపల్లి గ్రామాల మధ్య ప్రయాణిస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో రాజశేఖరచౌదరి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సోమశేఖర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టీఏల వేతన వెతలు

- రాష్ట్ర ప్రభుత్వం కరుణించినా స్పందించని జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు
- గతేడాది జూలై 6న జీఓ జారీ
- చాలీచాలని వేతనాలతో సరిపెట్టుకుంటున్న 200 మంది టీచింగ్ అసిస్టెంట్లు



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో పనిచేస్తున్న టీచింగ్ అసిస్టెంట్లకు జీతాల పెంచే విషయంగా వర్సిటీ ఉన్నతాధికారులు నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న టీచింగ్ అసిస్టెంట్‌లకు జీతం పెంచుతూ గత ఏడాది జూలై 6న జగన్ సర్కార్ జీఓ జారీ చేసింది. అయినా జేఎన్‌టీయూ అధికారుల్లో మార్పు రాలేదు. దీంతో చాలీచాలని వేతనాలతో 200 మంది టీచింగ్ అసిస్టెంట్లు సరిపెట్టుకునే పరిస్థితి నెలకొంది.

అమలు కాని ఉత్తర్వులు

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ఓటీపీఆర్‌ఐ, జేఎన్‌టీయూ–పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ–కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో మొత్తం 200 మంది టీచింగ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. ఇందులో అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న వారు 98 మంది ఉన్నారు. వీరిలో అత్యధికులు పీహెచ్‌డీ పూర్తి చేసిన వారున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న టీచింగ్ అసిస్టెంట్లకు జీతాలు పెంచుతూ గత ఏడాది జూలై 6న ప్రభుత్వం జీఓ నంబర్ 110 జారీ చేసింది. ఈ జీఓ మేరకు యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ, బీసీఐ గుర్తింపు పొందిన వర్సిటీల్లో పనిచేస్తున్న టీచింగ్ అసిస్టెంట్‌లకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి మరో రూ.5 వేలు అదనంగా చెల్లించాలి. ఈ లెక్కన పీహెచ్‌డీ చేసిన టీచింగ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.40 వేలుగా నిర్ధారించారు. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ఎంటెక్, ఎంఫార్మసీ పూర్తి చేసి ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాల్లో పనిచేస్తున్న టీచింగ్ అసిస్టెంట్లకు రూ.35 వేలు, పీహెచ్‌డీ పూర్తి చేసి నప్పటి నుంచి రూ.40 వేలు జీతం చెల్లించాల్సి ఉంటుంది. తర్వాత ఏటా రూ.1000 చొప్పున ఇంక్రిమెంట్ ఇవ్వాలి. జీఓ 110ని ఇప్పటి దాకా జేఎన్‌టీయూ (ఏ)అమలు చేయకపోవడంతో టీచింగ్ అసిస్టెంట్లు నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకున్నా... క్షేత్ర స్థాయిలో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా టీచింగ్ అసిస్టెంట్లు మండిపడుతున్నారు.

కమిటీ ఏర్పాటు చేశాం

టీచింగ్ అసిస్టెంట్ల జీతాల పెంపుదలకు సంబంధించి కమిటీని నియామకం చేశాం. ఇందులో ప్రిన్సిపాల్స్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. కమిటీ సిఫార్సుల మేరకు త్వరలోనే టీచింగ్ అసిస్టెంట్లకు ఇంక్రిమెంట్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన, వీసీ, జేఎన్‌టీయూ (ఏ)

సుబ్బమ్మ.. కన్నీటి చెమ్మ!



చేతికెదిగేవరకూ పసిపిల్లలని పెంచింది. ఏడుస్తుంటే తల్లడిల్లింది. ఆకలని తెలుసుకొని గోరుముద్దలు తినిపించింది. పొత్తిళ్లలో ఉంచుకుని జోలపాడి నిద్రపుచ్చింది. బాధలు దిగమింగి బాధ్యతలు మోసింది. చేతుల కష్టంతో కుటుంబాన్ని నడిపింది. ఇన్ని చేసిన సుబ్బ'అమ్మ' తనకంటూ ఏమి మిగుల్చుకుంది? ఏడుగురు సంతానమున్నా ఏ ఒక్కరూ వెన్నంటిలేరు. ఏడుపదుల వయసులో మిగిలిందల్లా జీవన భృతి కోసం చేతివృత్తి మాత్రమే. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన సుబ్బమ్మకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరందరికీ పెళ్లిళ్లు చేసి, బరువు బాధ్యతలు దించుకుంది. ఆమె మాత్రం అనంతపురం సర్వజనాస్పత్రి ఆవరణలో తలదాచుకుంటూ కుర్చీలకు అల్లికలతో వచ్చే అంతో ఇంతో ఆదాయంతో పొట్ట పోసుకుంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

క్లుప్తంగా

వేగంగా ప్యాచ్ వర్కులు



27వ డివిజన్ అశోక్‌నగర్ సర్కిల్‌లో ప్యాచ్ వర్కులు జరుగుతున్న దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలో ప్యాచ్ వర్కులు వేగవంతంగా సాగుతున్నాయి. పలు డివిజన్లలో గుంతలను పూడ్చటానికి కమిషనర్ కే భాగ్యలక్ష్మి టెండర్ ప్రాతిపదికన రూ.10 లక్షల వ్యయంతో ప్యాచ్ వర్కుల నిర్వహణకు చర్యలు చేపట్టారు. మంగళ వారం అశోక్‌నగర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంతను పూడ్చేందుకు పనులు మొదలుపెట్టారు. డీఈ చంద్రశేఖర్ పనులను పర్యవేక్షించారు.

రేపు 2కే రన్

అనంతపురం అర్బన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈనెల 12న డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహారెడ్డి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ కళాశాల నుంచి రాంనగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు రన్ ఉంటుందన్నారు. 2కే రన్‌లో ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్‌తో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు.

చెత్త సేకరణ పక్కాగా జరగాలి

అనంతపురం క్రైం: క్లాప్ ఆటోల ద్వారా చెత్త సేకరణ పక్కాగా జరగాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి సచివాలయ పారిశుధ్య కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని 25, 27, 28, 55 సచివాలయ పరిధిలో క్లాప్ ఆటోల ద్వారా జరుగుతున్న చెత్త సేకరణ కార్యక్రమాన్ని అదనపు కమిషనర్ పర్యవేక్షించారు. రెడ్, బ్లూ, గ్రీన్ డస్ట్‌బిన్ల ద్వారా అందించే చెత్తను కేటాయించిన వాటిలోనే ఉంచి, కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు.

విజయమే లక్ష్యంగా కృషి చేయండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా పారా అథ్లెటిక్స్ క్రీడాకారులు విజయమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు అన్నారు. రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ అభినందించారు. విశాఖలో రాష్ట్రస్థాయిలో జిల్లా నుంచి 15 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా పారా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

11 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని కొనుగోలు చేసి తీసుకెళ్తున్న శింగనమలకు చెందిన చిన్నగంగన్నను అరెస్ట్ చేసి, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ గౌస్ మంగళ వారం తెలిపారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తుండగా, అటుగా వచ్చిన బొలెరో వాహనంలో బియ్యం పట్టుబడినట్లు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలియజేశారు. సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకులు మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, సీఐటీయూ నాయకులు శివశంకర్ , మధ్యాహ్న భోజన జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, మండల నాయకురాలు విజయ పాల్గొన్నారు.

కల్వర్టుల పనులు చేపట్టాలి



సాయినగర్‌లో దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలో దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతు పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ నాగమోహన్‌ను మేయర్ వసీం ఆదేశించారు. మంగళవారం నగరంలోని 19వ డివిజన్ సాయినగర్‌లో దెబ్బతిన్న కల్వర్టును మేయర్ పరిశీలించారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని, ఏమాత్రం జాప్యం చేయకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాలవల్లో పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టేలా చూడాలని సంబంధిత పారిశుధ్య సిబ్బందిని మేయర్ ఆదేశించారు. నగర ప్రజలు చెత్తను కాలువలో పడేయకుండా చెత్త తీసుకెళ్లే వాహనాలకు అందించాలన్నారు. కార్పొరేటర్లు బాలాంజనేయులు, శ్రీనివాసులు, నాయకులు రామచంద్ర, తదితరులు ఉన్నారు.

నేడు త్యాగరాజ ఆరాధనోత్సవాలు



అనంతపురం కల్చరల్: నగరంలో త్యాగరాజ స్వామి 176వ ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా జరుగనున్నాయి. ఆరాధనోత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక నుంచి విద్వాంసులు తరలివస్తున్నారు. జిల్లా కేంద్రంలో త్యాగరాజ స్వామి ఏకైక ఆలయం ఉంది. నగరంలో పాతికేళ్లకిందట వరకు త్యాగరాజ స్వామి చిత్రపటంతో ఆరాధనోత్సవాల సమయంలో సంప్రదాయ సిద్ధంగా వస్తున్న నగర సంకీర్తనలు చేసేవారు. నగరానికి చెందిన దివంగత ఉద్ధండ పండితుడు బ్రహ్మశ్రీ మొదలి బాలవిశ్వనాథ శర్మ, సంగీత విదూషి రామరత్నమ్మ దంపతులు విశేష కృషి చేసి, త్యాగరాజ స్వామి ఆలయాన్ని నిర్మించారు. 1992లో సొంత ఖర్చులతో మొదటిరోడ్డులోని ప్రాచీన కాశీవిశ్వేశ్వర కోదండరామాలయ ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని శారదా మాత, శంకరభగవత్పాదుల సరసన శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. పెనుశిల క్షేత్రం భగవతి విజయేశ్వరి మాత ఆనాటి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని, సంగీతోత్సవాలకు అంకురార్పణ చేశారు. నాటి నుండి నేటి వరకు మొదలి వంశస్తులు ఉత్సవాల సమయంలో సంగీత కచేరీతో అనంత వాసులకు త్యాగయ్య సంగీతామృతాన్ని పంచుతున్నారు.

నేడు పంచరత్న గాన సేవలు : త్యాగరాజ ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని కోదండరామ విశ్వేశ్వరాలయంలో త్యాగరాజ స్వామికి పంచామృతాభిషేకాలు, అర్చనలతో పాటు సంగీత విద్వాంసులతో సామూహిక పంచరత్న గానసేవలు నిర్వహిస్తున్నారు. శ్రీవిజయవాణి సంగీత కళానిలయం నిర్వాహకులు మొదలి మురళీకృష్ణ ఉత్సవాల వివరాలు అందించారు. బుధవారం ఉదయం 8 గంటలకు స్థానిక కళాకారులు త్యాగరాజ కీర్తనలనాలపిస్తూ నగర సంకీర్తన, పంచరత్న గోష్ఠి గాన సేవలుంటాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు సాగే సంగీత విభావరిలో స్థానిక విద్వాంసులతో పాటు బెంగళూరు నుంచి వచ్చే వైదేహి చైతన్య బృందం పాల్గొంటారు.

పత్తాలేని అంగన్‌వాడీ కార్యకర్త



చిన్నారులతో ఆయా సౌభాగ్య



అంగన్‌వాడీ కేంద్రం-3 బోర్డు

రాప్తాడురూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తూ, చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాల్సిన బాధ్యత కార్యకర్తలది. అయితే అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని సిండికేట్‌నగర్-3 కేంద్రం అంగన్‌వాడీ కార్యకర్త త్రివేణి మాత్రం విధులను గాలికొదిలేసింది. ఈనెల 6నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి రావడంలేదు. ఆయా సౌభాగ్య మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించాల్సి వస్తోంది. కార్యకర్త బాధ్యతారాహిత్యం వల్ల చిన్నారుల సంఖ్య తగ్గిపోతోంది. మంగళవారం కేవలం ఆరుగురు చిన్నారులు మాత్రమే సెంటర్‌కు వచ్చారు. తరచూ సెంటర్‌కు రాకపోవడం, సెంటర్‌కు వచ్చినా చిన్నారుల బాగోగులు పట్టించుకోకపోవడం, ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతోందన్న విమర్శలు ఉన్నాయి. సర్పంచ్ అంజియాదవ్, ఎంపీటీసీ సభ్యుడు గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలకృష్ణ తదితరులు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించగా, కార్యకర్తపై స్థానికులు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణను పట్టించుకోని కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మాకు సమాచారం లేదు

అంగన్‌వాడీ టీచరు త్రివేణి గైర్హాజరుపై తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని కూడేరు సీడీపీఓ ధనలక్ష్మి తెలిపారు. విచారించి, నోటీసు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఎవర్నీ ఉపేక్షించేదే లేదన్నారు. అక్కడి కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతల సేవలకు ఆటంకం కలగకుండా చూస్తామని ఆమె తెలిపారు.

ఉపాధి కూలీల వేతనాలు పెంచాలి

రాప్తాడు: వంద రోజులు పనులు పూర్తి చేస్తున్న కూలీలకు 200 రోజులు పనులు కల్పించి, వేతనాలు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు కోరారు. మంగళవారం స్థానిక పంగల్ రోడ్డు సమీపంలోని నిర్మితి కేంద్రంలో ఉపాధి అధికారులకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సభ్యులు ఎర్ర పోతన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మౌలాలి, శ్రీనివాసులు, బాషా, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



చిన్మయనగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు వర్దిరెడ్డి విజయ్‌వర్ధన్ రెడ్డి

రాప్తాడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు వర్దిరెడ్డి విజయ్ వర్ధన్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో ఇంటింటికీ తిరిగి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రాడ్యుయేట్లను కోరారు. ఆయన మాట్లాడుతూ వెన్నపూస రవీంద్రారెడ్డికి జెడ్పీటీసీ, జెడ్పీ ప్రతిపక్ష నేతగా, హైకోర్టు లాయర్‌గా అనుభవం ఉందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా వెన్నపూస రవీంద్రా రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, గణేష్ ముత్యాల రెడ్డి, విజయ కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇమాంషావలీ షంషీర్ ఊరేగింపు



షంషీర్‌ను ఊరేగించి దర్గాకు తీసుకొస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో ప్రఖ్యాతి గాంచిన హజరత్ ఇమాంషావలి ఉరుసుకు భక్తులు పోటెత్తారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు ఉరుసు ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతం కిక్కిరిసిపోయింది. దర్గాలో భక్తులు చక్కెర ఫాతెహాలు, చక్కెర తులాభారం చేయించి మొక్కుబడులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకూ మైసూరు నుంచి వచ్చిన సమ్రీన్‌తాజ్, కడప నగరం నుంచి వచ్చిన నవాజ్ ఛిస్తీ మధ్య పోటాపోటీగా సాగిన ఖవ్వాలీ భక్తులను ఆకట్టుకుంది. సోమవారం వేకువజామున హజరత్ ఇమాంషావలీ ప్రతిరూపమైన షంషీర్‌ను డ్రమ్ములు, మేళాతాళాయి నడుమ భక్తిశ్రద్ధలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

వామ్మో..దొంగలు

- పశువులు, వ్యవసాయ పరికరాలు అపహరణ
- వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన

ఆత్మకూరు: గ్రామాల్లో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పొలాల్లోని వ్యవసాయ పరికరాలను అపహరిస్తున్నారు. పశువులను ఎత్తుకెళ్తున్నారు. మండలంలోని సిద్దరాంపురంలో కళ్లాల్లో కట్టేసిన పశువులను (ఆరు ఎనుములు, ఆవులు) సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన నారాయణస్వామికి చెందిన రెండు ఆవులు, చిరంజీవికి చెందిన రెండు ఎనుములు, హరీష్ అనే రైతుకు చెందిన ఒక ఎనుము, అమృత్ అనే రైతుకు చెందిన ఒక ఎనుము ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం రైతు వచ్చి చూస్తే ఎనుములు కనిపించలేదు. ఒక్కో ఎనుము విలువ రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు పలుకుతుందని బాధితులు తెలిపారు. గత నెలలో ఇదే గ్రామంలో రాము అనే రైతుకు చెందిన రెండు ఎనుములు ఎత్తుకెళ్లారు. ఆత్మకూరు మండల కేంద్రంలో రెండు వారాల క్రితం రెండు ఇళ్లలో దాదాపు రూ.25 వేల వరకు నగదు, కొంత మేరకు వెండి ఎత్తుకెళ్లారు. ఈనెల 2న ఆత్మకూరులోని ముట్టాల రోడ్డులో ఓ రైతుకు సంబంధించిన రూ.80 వేలు విలువజేసే ఎనుము ఎత్తుకెళ్లారు. పొలాల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు, వ్యవసాయ పరికరాలు ఎత్తుకెళ్తున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా విద్యుత్ మోటార్ల కేబుల్, స్టార్టర్లు ఎత్తుకెళ్లారు.

విచారణ చేయిస్తున్నాం

ఆత్మకూరు మండలంలో పలు చోట్ల చోరీలు జరిగాయన్న ఫిర్యాదులు వచ్చాయని ఇటుకలపల్లి సీఐ మోహన్ తెలిపారు. ఘటనాస్థలాలకు వెళ్లి పరిశీలించామన్నారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

నిత్య పర్యవేక్షణతో మెరుగైన సేవలు

- క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటేశ్వరరావు



నీటి సరఫరాను పరిశీలిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు, ఈఈ రాజగోపాల్ రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నిత్య పర్యవేక్షణతో మెరుగైన సేవలు అందుతాయని క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రి, మెడికల్ కళాశాలలో జరిగిన పనులు, జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన వాటర్ సప్లై, ఆక్సిజన్ ప్లాంట్లను పరిశీలించారు. ఫైర్ సేఫ్టీలో భాగంగా తలుపును స్టీల్‌కు మార్చాలన్నారు. అత్యవసర విభాగాలకు నీరు, ఆక్సిజన్ ఇతర సదుపాయాలపై పర్యవేక్షించాలన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న గదులపై చెట్ల కొమ్మలు ఉంటున్నాయని, వాటిని తొలగించాలన్నారు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పీవీకేకే విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో కళాశాల సిబ్బంది

అనంతపురం రూరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో పీవీకేకే పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వైభవ్ తెలిపారు. ఈఈఈ మొదటి సంవత్సరం విద్యార్థి హుసేన్‌వలి 100 మీటర్లు, ఈసీఈ విద్యార్థిని స్ఫూర్తి 800 మీటర్ల పరుగు పందెం, రాజ్యలక్ష్మి చదరంగం, మధురిమ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ అభినందించారు.

ముందు జాగ్రత్తలతో తెగుళ్ల నివారణ

నార్పల: ముందు జాగ్రత్త చర్యలతో పంటల్లో తెగుళ్లను నివారించుకోవచ్చని ఏఓ ముస్తఫా పేర్కొన్నారు. మంగళవారం బి.పప్పూరులో పలు వేరుశనగ, మొక్కజొన్న పొలాలను పరిశీలించారు.

తప్పిన పెను ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మీటర్ కాలుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం: ఆకతాయుల ఆటలతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం పట్టణంలోని స్థానిక వడ్డే కాలనీలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో అట్టముక్కలకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ మీటర్ పూర్తిగా కాలిపోయింది. అటుగా వాకింగ్ వెళ్తున్న వారు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చారు. అప్రమత్తమైన అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మీటర్ కాలినట్లు గుర్తించారు.

18న జాతర

చెన్నేకొత్తపల్లి: తోపుదుర్తి గ్రామంలో ఈ నెల 18న నిర్వహించనున్న పెద్దమ్మ జాతర (ఊరదేవర)కు మండలంలోని ప్రజలు తరలిరావాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రజలకు కరపత్రాలు అందజేసి, ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహా రెడ్డి, పలువురు సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టండి

గార్లదిన్నె: ఉపాధి పనులు పారదర్శంగా చేపట్టాలని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఇల్లూరులో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ కింద రైతులకు ఉపయోగపడేలా నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. ప్రతి కూలీకి రోజుకు రూ.257 వేతనం లభించేలా చూడాలన్నారు. అడిగిన వెంటనే పనులు కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన సప్లయ్ ఛానల్ పనులు పరిశీలించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గార్లదిన్నె, శింగనమల, పెద్దవడుగూరు, పామిడి, గుత్తి మండలాలకు సంబంధించిన ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ విజయ్‌కుమార్, ఎంపీడీఓ విజయ భాస్కర్, ఏపీఓ నాంచారమ్మ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సక్రమంగా పని చేయాలి

శింగనమల: ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా సేవలందించాలని సచివాలయ సిబ్బందిని డివిజనల్ అభివృద్ధి అధికారి ఓబులమ్మ ఆదేశించారు. శింగనమల, సోదనపల్లి, సలకంచెరువు గ్రామ సచివాలయలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలను నోటీస్ బోర్డ్‌లో ఉంచాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్డీ శివనారాయణరెడ్డి ఉన్నారు.

యాడికి: యాడికి మేజర్ పంచాయతీలోని 5 సచివాలయాల సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎల్‌డీఓ ఓబుళమ్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని 3,4 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్య పనులపై చర్చించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు రామ్‌సతీష్, రమేష్‌రెడ్డి, శోభారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్రమోదక హోమం



సర్వాలంకారభూషితుడై దర్శనమిచ్చిన వినాయకుడు



గీతామందిరంలో హోమాలు

అనంతపురం కల్చరల్: లంబోధరా నమో నమః ..అంటూ జిల్లా కేంద్రంలోని గీతామందిరం మార్మోగింది. మంగళవారం సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని 150 జంటలతో సహస్రమోదక గణపతి హోమం ఘనంగా జరిగింది. వేదపండితులు వేర్వేరుగా ఏర్పాటు చేసిన హోమగుండాల వద్ద వేదమంత్రాలతో హోమాన్ని శాస్త్రోక్తంగా చేయించారు. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేసిన వినాయకుడికి 1000 కుడుములు సమర్పించి, వాటిని భక్తులకు వితరణ చేశారు. అంతకు ముందు నవగ్రహ హోమం, వినాయక వ్రతం జరిగింది.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న నారాయణపురం వైఎస్సార్ సీపీ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరానికి దీటుగా పంచాయతీలను అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిది అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, బీసీ సెల్ నాయకులు మల్లెల వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లికి నీరు తెచ్చిన ఘనత తమదేనని గొప్పలు చెప్పుకునే ప్రభాకర్‌చౌదరి.. నాగిరెడ్డిపల్లికి పైపులైన్ వేసేందుకు రూ.లక్షలు వెచ్చించి, కనీసం బిల్లులు కూడా అందించలేదన్నారు. అప్పటి కాంట్రాక్టర్ నాగేంద్ర ప్రస్తుతం తమ పార్టీలో ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొందాడన్నారు. ఎస్టిమేషన్ లేకుండా వర్క్‌శాంక్షన్ కాకుండా పైపులైన్ వేయించి, చేతులు దులుపుకున్నారన్నారు. వాటికి సంబంధించిన నిధులను తాము చేయించామన్నారు.

టీడీపీ హయాంలో అంతులేని అవినీతి :

టీడీపీ హయాంలో నారాయణపురం పంచాయతీలో ఎక్కడాలేని అవినీతి జరిగిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. లేఅవుట్ అప్రూవల్, బిల్డింగ్ అనుమతి పేరుతో రూ.కోట్లు దండుకున్నారన్నారు. ప్రభుత్వ భూములను టీడీపీ నాయకులు ధారాదత్తం చేసుకున్నారన్నారు. ప్రభాకర్‌చౌదరి ఎమ్మెల్యేగా ఉండి కూడా కనీసం అడ్డుకోకపోగా, నీతులు మాట్లాడుతున్నారన్నారు. మీ హయాంలో అభివృద్ధి చేసి ఉంటే ఒక్క సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేటర్, వార్డు మెంబర్లుగా కూడా గెలవలేకపోయారన్నారు. బ్రిడ్జి నిర్మిస్తామని, డ్రైనేజీలు నిర్మిస్తామని హామీలు ఇచ్చి, చేసిందేమీలేదన్నారు. సమావేశంలో ఎంపీటీసీ బళ్లారి నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి జగన్‌మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సత్యన్న, హాజీవలి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు

అనంతపురం రూరల్: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్డీఓ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం దామోదర సంజీవయ్య భవన్ సమావేశ మందిరంలో అనంతపురం నియోజకవర్గ పరిధిలోని సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకూడదన్న ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ ఓటరు కార్డుకు ఆధార్ లింక్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలో ఓటరు ఐడీ కార్డులకు ఆధార్ అనుసంధానం చేసే విషయంలో బీఎల్‌ఓలు తీవ్ర నిర్లక్ష్యం చూపుతన్నారన్నారు. వీలైనంత తొందరగా వంద శాతం ఆదార్ లింక్ చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

రాప్తాడు: ఓటర్ కార్డుకు ఆధార్ నమోదు తప్పనిసరి అని తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరుకార్డుకు ఆధార్ నమోదుపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌ఓల ప్రమేయం లేకుండానే ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, నేషనల్ ఓటర్ సర్వీసు పోర్టల్, ఓటర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆధార్-ఓటర్ కార్డుల అనుసంధానం చేసుకునే విధానంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మండల వ్యాప్తంగా ఓటరు కార్డుకు 60 శాతం మాత్రమే అనుసంధానం చేశారని, మిగిలిన 40 శాతాన్ని త్వరగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈడీటీ మల్లికార్జున, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి



గర్భిణులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న సబిహా సుల్తానా

ఆత్మకూరు: గర్భిణులు ప్రతి నెలా సక్రమంగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సబిహా సుల్తానా తెలియచేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులకు రక్తశాత పరీక్షలు, బీపీ, షుఘర్ పరీక్షలు చేశారు. సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రావతి, ఎంపీహెచ్‌ఓ నాగేశ్వరయ్య, మునిఫ్, సూపర్‌వైజర్ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

రాప్తాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు ఉద్యోగ వేతనాలను పెంచాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనరసింహకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు, సహాయకురాలికి రూ.20 వేలు వేతనాన్ని వెంటనే పెంచాలన్నారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు సీఐటీయూ అఖిల భారత మహాసభలు బెంగళూరు నగరంలో ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు పోతులయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మహిళ నాయకురాలు అరుణ, ఓబులమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్షన్ సెంటర్లకు రాయితీ

గార్లదిన్నె: ఉద్యానశాఖ ద్వారా రైతు సంఘాలకు పరికరాలు, కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు రాయితీ ఇస్తామని ఉద్యాన శాఖ ఏడీ నరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం కొప్పలకొండ, కేకే తండా, కమలాపురంలో చీనీ పంటలను ఉద్యాన శాఖ ఏడీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెట్ల మొదళ్లకు బోర్డో మిశ్రమాన్ని పూయాలన్నారు. వేరుకుళ్లు తెగులు నివారణకు రైతులంతా బోర్డో మిశ్రమం పద్ధతి పాటించాలన్నారు. ఉద్యానశాఖలో రైతులు సంఘాలుగా ఏర్పాటు చేసుకుంటే వ్యవసాయ పరికరాలకు, కలెక్షన్ సెంటర్లకు 75 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)-రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్-వరేలా ద్వయం 6-3, 7-6 (7/4)తో రాబిన్ హాస్-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్-వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11-2, 5-11, 2-11, 5-11, 13-11, 11-9, 11-8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13-11, 11-9, 11-6, 11-8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-19, 21-14తో యంగ్ ఎన్గా టింగ్-యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12-21, 21-17, 14-21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10-21, 8-21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్-కృష్ణప్రసాద్ ద్వయం 10-21, 18-21తో కాంగ్ మిన్ హుక్-సియో సెయింగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19-21, 14-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్-జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్-త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పోర్వోరిమ్‌లో పాండిచ్చేరి-గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలి షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్



షనక

అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.



కోహ్లి సెంచరీ అభివాదం



9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1-143, 2-173, 3-213, 4-303, 5-330, 6-362, 7-364. **బౌలింగ్:** కసున్ రజిత 10-0-88-3, మదుషంక 6-0-43-1, హసరంగ 10-0-67-0, కరుణరత్నే 8-0-54-1, దునిత్ 8-0-65-0, షనక 3-0-22-1, ధనంజయ 5-0-33-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1-19, 2-23, 3-64, 4-136, 5-161, 6-178, 7-179, 8-206. **బౌలింగ్:** షమీ 9-0-67-1, సిరాజ్ 7-1-30-2, పాండ్యా 6-0-33-1, ఉమ్రాన్ 8-0-57-3, చహల్ 10-0-58-1, అక్షర్ 10-0-58-0.

సినిమా

మా ఇల్లే పాన్ ఇండియా



శ్రుతీహాసన్

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

- **రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?**

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

- **రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...**

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతా దంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

- **'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..**

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహ..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

- **చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...**

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

- **ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?**

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

- **ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...**

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

- **'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?**

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

- **ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?**

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచి సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతే కానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో...
పది భారతీయ చిత్రాలు







ప్రతిష్ఠాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాఠీ కహీ హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరఫున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతారా' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది



- ఎస్ఎస్ తమన్

"పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి" అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

- బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది.
- దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది.
- 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు.
- ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– "ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిషోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్" అన్నారు. "ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్" అన్నారు మురళీ కిషోర్. "గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసూగారికి థ్యాంక్స్" అన్నారు కిరణ్ అబ్బవరం.



- కశ్మీరా, కిరణ్ అబ్బవరం

నా కల తీరుతోంది



- సంతోష్ శోభన్

"నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది" అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– "ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు.